ప్రజా వినతుల పరిష్కార వ్యవస్థకు 149 వినతులు

- వినతులను గడువు లోగా పరిష్కరించాలి

- కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం : అధికారులు ఏ రోజు వినతులు ఆ రోజే చూడాలని, నాట్ వ్యూ ఉండకూడదని , అలాగే వచ్చిన వాటిని గడువు లోగా నే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. సోమవారం నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వ్యవస్థకు వివిధ సమస్యలపై ప్రజల నుండి వినతులను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు రీ ఓపెన్ అయిన వాటిని కూడా నిర్దేశిత గడువులోగా పంపాలని, ఆన్లైన్ లో ఏ స్టేజిలో కూడా పెండింగ్ కనపడకూడదని అన్నారు. సోమవారం వివిధ సమస్యలపై ప్రజల నుంచి 149 వినతులు అందాయి. కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ కార్తీక్, డి.ఆర్.ఓ. ఎస్.డి.అనిత వినతులు స్వీకరించారు. రెవిన్యూ శాఖ సమస్యలపై 75, డిఆర్డిఏ. కు సంబంధించి 14, జిల్లా పంచాయతీ శాఖ కు 10, వైద్యశాఖ కు సంబంధించి 06, మున్సిపల్ శాఖకు 11 చొప్పున అందగా మిగిలినవి ఇతర శాఖలకు సంబంధించిన వినతులు అందాయి.

రాష్ట్ర స్థాయి అండర్ -17, సింగిల్స్ బాడ్మింటన్ కి ఎంపిక

డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ విద్యార్థిని లాస్య

విశాలాంధ్ర-శృంగవరపుకోట: స్థానిక డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ లో 8వ తరగతి చదువుతున్న లాస్య విజయనగరం జిల్లాస్థాయిలో నిర్వహించిన అండర్ -15 డబుల్ బాడ్మింటన్ లో విన్నర్ గాను మరియు అండర్ -17 బాడ్మింటన్ సింగల్స్ లోను రన్నర్ గాను విజయం సాధించి, రాష్ట్ర స్థాయి అండర్ -17 సింగల్ బాడ్మింటన్ కి సెలెక్ట్ అయ్యింది. రాష్ట్రస్థాయి బాడ్మింటన్ అండర్ -17విభాగంలో అర్హత సాధించిన లాస్య ను డాక్టర్ వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ యాజమాన్యం డాక్టర్ వరలక్ష్మి, శ్రీ కొలపర్తి రాజేంద్ర ప్రసాద్ మరియు పాఠశాల ప్రిన్సిపాల్ వై. జానకి దేవి వరలక్ష్మి పబ్లిక్ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు గొర్లె రాముని, మరియు ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థిని లాస్యను అభినందించి రాష్ట్రస్థాయిలో కూడా మెరుగైన ఫలితాన్ని తీసుకురావాలని ఆశించారు.

అధినాయకత్వం అడుగు ముందుకు.. జిల్లాలో మౌనం ఎందుకు?

విశాలాంధ్ర-విజయనగరం: విజయనగరం జిల్లాలో వైసిపి నాయకుల పరిస్థితేంటి? ఇంకా ఓటమి తెచ్చిన నైరాశ్యంలోనే వున్నారా? కార్యకర్తల్లో మనోధైర్యం నింపుతున్నారా? ఇదే ప్రస్తుతం జిల్లాలో చర్చనీయాంశంగా వుంది. అవును... మొన్న టి ఎన్నికల ముందు జిల్లాలో వైసీపీ అభ్యర్థుల్లో ఒకరిద్దరు మినహా మిగిలిన వారంతా మరోసారి విజయపథంలో నడు స్తారని ఆ పార్టీసగటు కార్యకర్తలు బలంగా నమ్మారు. కానీ ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో అభ్యర్థులంతా ఓటమి చెందారు. ఓటమి తరువాత మౌనం సహజమైన పరిణామం. విజయం మాట్లాడిస్తుందీ, ఓటమి మౌనం వహిస్తుందనేది అంతా ఎరిగిందే. కానీ నాయకత్వ స్థానంలో వున్నవారు మాత్రం వీలైనంత త్వరగా అందులో నుంచి బయటపడి కార్యకర్తలకు మనోధైర్యం కల్పించాల్సిన అవసరం వుంది. తాజాగా వైసీపీ అధిష్టానం అసెంబ్లీ దగ్గర నిరసన తెలిపే కార్యక్రమం చేపట్టడంలో అంతర్యం కూడా ఇదే. అటు ప్రభుత్వ వైఖరిపై తమ నిరసన తెలపడంతో పాటు అధినాయకత్వం యాక్టివ్ గా వుందనే సంకేతాన్ని పార్టీ శ్రేణులకు పంపిందనేది ఈ నిరసన కార్యక్రమం స్పష్టం చేస్తోంది. మరి విజయనగరం జిల్లాలో పరిస్థితేంటి? ఇటీవల కాలంలో జిల్లాలో జరిగిన పరిణామాలు వాటిపై ప్రతిపక్ష పార్టీగా తమ నాయకులు ఏ మేరకు స్పంది స్తున్నారనేది వైసిపి ద్వితీయ శ్రేణి నాయకత్వం, కార్యకర్తలు గమనిస్తున్నారు. అడపాదడపా ప్రెస్‌మీట్ల ద్వారా స్పందిస్తున్న నాయకులైతే ఒకరిద్దరు వున్నారు. ప్రజా సమస్యలపై పోరు సలుపుతూ ప్రజలతో మమేకమైతేనే ఏ పార్టీ కార్యకర్తలకైనా ఉత్తేజం కలగడంతో పాటు తమ నాయకత్వంపై కూడా నమ్మకం కలుగుతుంది. అయితే ఓటమి తరువాత పరిణాల నుంచి బయటపడడం అంత సులభంకాదనేది వాస్తవం. కానీ ఎంతత్వరగా యాక్టివ్ అయ్యారనే అంశం మాత్రం అత్యంత కీలకమే. దీనికోసమే కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు

బాలిక కిడ్నాప్‌పై కేసునమోదు

విశాలాంధ్ర-జామి: మండలంలోని రామయ్యపాలెం(కొత్తూరు) గ్రామంలో మైనర్ బాలికను కిడ్నాప్ చేసినట్లు వచ్చిన ఫిర్యాదుపై జామి పోలీసులు కేసు నమోదు చేసారు. ఈమేరకు పోలీసుల కథనం మేరకు రామయ్యపాలెంలో ఓతల్లీకూతరు కలిసి ఆదివారం కావడంతో గ్రామంలోని చర్చికి వెళ్ళారు. మద్యాహ్నం 12గంటల సమయంలో తమ కుమార్తె బైటకు వెళ్ళి తిరిగి రాకపోవడంతో తల్లి ఆందోళన చెందిన చుట్టు పక్కల వాకాబు చేసింది. తన కుమార్తె ఇద్దరు అబ్బాయిలతో కలిసి మోటార్ సైకిల్‌పై వెళ్ళినట్లుగా సమాచారం తెలుసుకుంది. వెంటనే కుటుంబసభ్యులు గ్రామంలోని పలువురితో కలిసి బలరాంపురం వద్ద నుంచి ఓ డిపార్ట్‌మెంటల్ స్టోర్ వద్ద ఏర్పాటు చేసిన సిసి కెమెరా పుటేజీని పరిశీలించగా రామయ్యపాలెం గ్రామానికి చెందిన భూపతి కిషోర్ తనకుమార్తెను తీసుకువెళ్ళినట్లుగా గుర్తించడం జరిగిందని, వారిద్దరినీ అదే గ్రామానికి చెందిన చెలపాక క్రాంతి గ్రామంనుంచి తీసుకువెళ్ళేందుకు సహకరించాడని మైనర్ బాలిక తల్లి జామి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరబాబు తెలిపారు.

నగరపాలక కార్యాలయంలో ప్రజా వినతుల పరిష్కార వేదిక

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయం నందు నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేదిక నకు 14 వినతులు వచ్చాయి. పలువురు తమ సమస్యలను వెల్లడిస్తూ వినతి పత్రాలను నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు నకు అందజేశారు. ఆయా వినతుల పరిష్కారానికై సంబంధిత విభాగ అధికారులకు కమిషనర్ ఆదేశించారు.టౌన్ ప్లానింగ్ విభాగానికి 5 ,ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 4, శానిటేషన్ కు సంబంధించి 2, రెవెన్యూ సంబంధించి 1,మెప్మా సంబంధించి 1, సచివాలయం నకు సంబంధించి 1 చొప్పున వినతులు అందాయి. సిబ్బంది వినతులను స్వీకరించిన కమిషనర్ ఎంఎం నాయుడు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు.ప్రజల నుండి వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కారం అయ్యే దిశగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు మధుసూదన రావు,అమ్మాజీ రావు, ఈఈ కే.శ్రీనివాసరావు, మేనేజర్ ప్రసాదరావు,టిపిఆర్ ఓ. సింహాచలం, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులతో వెట్టిచాకిరీయేనా... సకాలంలో జీతాలు ఇవ్వరా ?

ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ప్రభుత్వ ఆసుపత్రిల్లో, వైద్య కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్ మొదలైన కాంట్రాక్టు వర్కర్లతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్న హాస్పిటల్స్ సూపరింటెండెంట్, ప్రిన్సిపల్, డిసిహెచ్ఎస్ లు కాంట్రాక్టర్లు చేత పెరిగిన జీతాలు, పిఎఫ్ డబ్బులు, ఈఎస్ఐ కార్డులు ఎందుకు ఇప్పించలేకపోతున్నారని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మండిపడ్డారు. సోమవారం ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) ఆధ్వర్యంలో ఏఐటియుసి ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ నేతృత్వంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా చేపట్టి జిల్లా కలెక్టర్ అంబేద్కర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుగత అశోక్ మాట్లాడుతూ హాస్పిటల్స్ లో ఉన్న పేషేంట్లకి ఇబ్బంది కలగకుండా, ప్రాణాలు లెక్కచేయకుండా పనులు చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లు, సెక్యూరిటీ గార్డులు, సూపర్వైజర్లు జీవితాలను జగన్ ప్రభుత్వం కాంట్రాక్ట్ దళారీ వ్యవస్థ చేతుల్లో పెట్టేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీతాలు ఇవ్వనప్పుడల్లా రోడ్డెక్కి ధర్నాలు చేస్తేనే జీతాలు వేస్తారు లేకుంటే వారిని పండుగల్లో కూడా పస్తులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ప్రభుత్వ సర్వజన, ఘోష, వైద్య కళాశాల, పి.హెచ్.సి, సి.హెచ్.సి, ఏరియా ఆసుపత్రలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుద్ధ్య, పెస్ట్ కంట్రోల్ వర్కర్లకు, సూపర్వైజర్లుకి ప్రభుత్వం జారీ చేసిన 549 జీవో ప్రకారం కాంట్రాక్ట్ వర్కర్స్ కి 16000, సెక్యూరిటీ గార్డులకి జి.ఓ నెం. 43 ప్రకారం 12,688/- జీతాలు ప్రకటించిన ప్రభుత్వం వర్కర్స్ జీతభత్యాల విషయం తెలంగాణ రాష్ట్రంలో నల్లగొండ జిల్లాకు చెందిన టి.వి.టి గ్రూప్స్ అనే కాంట్రాక్టరుకి, భీమవరంలో ఉన్న స్మాట్ ల్యాండ్ గ్రూప్ కాంట్రాక్టరుకి గత ప్రభుత్వం అప్పగించి కమిషన్లకి ఆశపడి దళారీ వ్యవస్థను ప్రోత్సహించడం వలనే వైసిపి కి కార్మికులు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ఇలా దళారీ చేతుల్లో పెట్టడం వల్ల పెరిగిన వేతనాలు ఇవ్వకుండా, ప్రతి నెలా సక్రమంగా జీతాలు చెల్లించకుండా వర్కర్స్ బతుకులతో ఆడు కుంటున్నారని మండిపడ్డారు. శ్రమకి తగిన జీతం లేక, ప్రతి నెల జీతాలు అందకపోవడం వల్ల ధరల భారాలను తట్టుకోలేక అప్పులపాలు అయ్యి వడ్డీ వ్యాపారుల చేతుల్లో చిక్కి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. కాంట్రాక్టరు మారిన తర్వాత సుమారు 36 మాసాలు నుంచి పిఎఫ్ ఎంత జమ అవుతుందో, ఈఎస్ఐ ఎంత కటింగ్ చేస్తున్నారో ఇంతవరకు పే స్లిప్పులు ద్వారా తెలియజేయకుండా నాటకాలాడుతూ తక్కువ వేతనాలు చూపిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని అన్నారు. హాస్పిటల్స్ వార్డులు పెరగిడం వలన ఆసుపత్రిలో సరిపడా వర్కర్స్ నియమించకుండా తక్కువ మంది వర్కర్స్ తో వెట్టిచాకిరీ చేయించుకుని ప్రభుత్వం జారీ చేసిన జీవో 549 ప్రకారం జీతాలు ఇవ్వకుండా కాంట్రాక్టరు కార్మికులందర్నీ మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కరోనా సీజన్లో కూడా ఇల్లు, పిల్లల్ని వదిలి ప్రాణాలు పణంగా పెట్టి, కరోనా రోగులకు సేవ చేసి వర్కర్స్ అందరూ కరోనా బారిన పడిన వారిని కనీసం గత ప్రభుత్వం లో ఎవ్వరూ పట్టించుకోలేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వ పాలకులు వెంటనే కలుగజేసుకొని ప్రభుత్వ ఆసుపత్రిల్లో, వైద్య కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్స్ అందరిని అప్కాస్ లో చేర్చి ప్రతి నెలా జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రిల్లో, వైద్య కళాశాల పనిచేస్తున్న పారిశుద్ధ్య, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ వర్కర్స్, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ధర్మవరం విద్యార్థిని

కాత్యాయిని ని అభినందించిన పాఠశాల సిబ్బంది

విశాలాంధ్ర -శృంగవరపుకోట: ధర్మవరం జెడ్పీ ఉన్నత పాఠ శాలకు చెందిన అల్లాడ కాత్యా యని ఈనెల 20న విజయ నగరం డిఎస్ఎ ఇండోర్ స్టేడియంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసి యేషన్ వారు నిర్వ హించిన జిల్లా స్థాయి బ్యాడ్మిం టన్ ఉమెన్ డబుల్స్ పోటీలలో పి. మౌనికతో కలిసి ద్వితీయ స్థానం సాధించింది అని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, లోకి రెడ్డి కృష్ణలు తెలియజేశారు. గెలుపొందిన కాత్యాయినికి పాఠశాల ప్రధానో పాధ్యాయులు బంగారు ఉమామహేశ్వరరావు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ కాత్యాయని ఆగస్టు నెలలో జరగబోవు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విజయనగరం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని అన్నారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: గాయత్రి హాస్పిటల్ లో సోమవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు సహకారంతో శ్రీశ్రీ కోచింగ్ సెంటర్ అధినేత పొట్టా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ ఎం జై చంద్ర నాయుడు, గాయత్రి హాస్పిటల్ ఎండి డాక్టర్ జిబి వెంకట్, పాల్గొని రక్తదాతలను అభినందించారు, రక్తదాన శిబిరాల నిర్వహిస్తున్న పొట్ట శ్రీనివాసరావుని అభినందిస్తూ రక్తదానం ప్రాణదానంతో సమానమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధి ఎం రాము వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం 48 మంది రక్తదానం చేశారు.

బంగారు పథక గ్రహీతకు సత్కారం

విశాలాంధ్ర- మెరక ముడిదాం: మండలంలో గర్భాం గ్రామానికి చెందిన బంగారు పథకం గ్రహీత నడిపిల్లి రమాదేవిని సోమ వారం గ్రామ పెద్దలు తాడ్డే వేణుగోపాలరావు, తాడ్డే శ్రీధర్, వజ్రపు గంగ రాజు, సిద్ధాంతి శ్రీనివారావు చే ఘనంగా సత్కరించారు. రమాదేవి మైసూర్ గణపతి సద్గురుసచ్చితానంద స్వామి వారి ఆధ్వర్యంలో భాగవతంలో గల 18 అధ్యాలల్లో అంతర్జాలంలో 700 శ్లోకాలపై నిర్వహించిన పరీక్షల్లో ఉత్తమ శ్రేణి విజేతగా నిలిచారు. దీనికిగాను మైసూర్ లో గల గణపతి సద్గుర సచ్చిదానంద ఆశ్రమంలో స్వామి చేతుల మీదుగా ఉత్తమ శ్రేణి బహుమతిని పొందారు. ఈ అవార్డును పురస్కరించుకొని గ్రామ పెద్దలు, ప్రజలు ఘనంగా సత్కరించారు.

మిరకిల్ ఇంజనీరింగ్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి

ఎమ్మెల్యేకు మాధవి కి మిరకిల్ కళాశాలలో గౌరవ సన్మానం

విశాలాంధ్ర-భోగాపురం: కళాశాలగా మిరకిల్ ఇంజినీర్ కళాశాలకు స్వయం ప్రతిపత్తి (అటానమస్) గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా మిరకిల్ కళాశాల అధ్యాపకులు కళాశాలలో ఎమ్మెల్యే లోకం నాగ మాధవికి గౌరవ సన్మాన కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ కళాశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తానని హామీ ఇచ్చారు. కళాశాలకు అటానమస్ గుర్తింపు తీసుకొచ్చిన అధ్యాపకులందరినీ అభినం దించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ అర్జునరావు మాట్లాడుతూ అటానమస్ స్థాయి గుర్తింపు అనేది మంచిదే కానీ ఆ గుర్తింపు నిలబెట్టుకోవడం అతి కష్టంతో కూడుకున్నదన్నారు. ఆ గుర్తింపుని శాశ్వతంగా నిలబెట్టడానికి విద్యార్థులు అధ్యా పకులు క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. కళాశాలలో ఏ విధమైన అవాంఛిత కార్యక్రమాలు జరగకుండా నిక్కచ్చిగా పరీక్షలు నిర్వహించటం, సకాలంలో విద్యార్థులకు సిలబస్ పూర్తి చేయడం, పేపర్ వాల్యూషన్ చేయటం, అలాగే పరీక్షలు ఫలితాలు కూడా అతి తక్కువ కాలంలో విద్యార్థులకు అందుబాటులో ఉంచటం చేయాలని అన్నారు. కళాశాల ప్రతిష్ట కోసం ఈ కార్యక్రమాలన్నీ బాధ్యతతో నిర్వహిస్తామని విద్యార్థులకు అలాగే సభలో పాల్గొన్న తల్లిదండ్రులకు తెలియజేశారు. డీన్ డాక్టర్ శ్రీనివాసరావు బెహరా మాట్లాడుతూ కళాశాలలో ఉన్నత ప్రమాణాలు పెంపొందించడం కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు పెంచుతున్నామని, విద్యార్థులకు అవసరమైన ఉద్యోగాలు కల్పన కోసం నిరంతరం ప్రయత్నిస్తున్నామని, ఆ దిశగా ఈ సంవత్సరం క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ సంఖ్య కూడా పెంచుతున్నామని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ జీవితాలలో స్థిరపడాలని కోరారు.

బాధితుల సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలి

- అధికారులను ఆదేశించిన ఎస్పీ వకుల్ జిందాల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ సిస్టం) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపిఎస్ సోమవారంనిర్వహించారు. ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా ఎస్పీ స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలపట్ల సానుకూలంగా స్పందించాలని, పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ 29 ఫిర్యాదులను స్వీకరించారు.ప్రజా సమ స్యల పరిష్కార వేదిక" ద్వారా స్వీకరించిన ఫిర్యాదు లపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, 7దినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరిం చేందుకు చర్యలు తీసు కోవాలని, ఫిర్యాదు లపై తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిటిసి డిఎస్పీ ఎం.వీరకుమార్, విజయనగరం డిఎస్పీ ఆర్.గోవిందరావు, డిసిఆర్ సిఐ జె.మురళి, ఎస్పీ సిఐలు కే.కే.వి.విజయనాథ్, ఈ.నర్సింహ మూర్తి, డిసిఆర్బి ఎస్ఐ మురళి మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇప్పుడున్న క్వారీలే నరకం చూపిస్తున్నాయి

- నూతన క్వారీ నిర్వహణ ఒప్పుకునేదిలేదు

- మేమూ మనుషులమని గుర్తించండి : ప్రభావిత గ్రామస్తులు

ఆర్డీఓ సూర్యకళ క్షేత్ర స్థాయి పరిశీలన

విశాలాంధ్ర-భోగాపురం: ఇప్పటికే చుట్టూ ఉన్న క్వారీల వలన ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయం భయంగా బ్రతుకుతున్నాం, మేము ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా,మా గోడు అధికారులు పట్టించుకోలేదని క్వారీల ప్రభావిత రామచంద్ర పేట గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేసారు. విమానాశ్రయ నిర్మాణం కోసం మండలంలో కొంగవానిపాలెం గ్రామ పంచాయతీలో గల సర్వే నెంబర్ 70-1 & 70-2 లో 1.278 హెక్టర్లలో సంవత్సరానికి 224857 రోడ్ మెటల్ టన్నులు తవ్వకం చేపట్టడం కోసం ప్రభుత్వం ఎల్ అండ్ టి సంస్థకు అనుమతులు మంజూరు చేసింది. అయితే రామచంద్రపేట గ్రామ ప్రజలు పనిచేస్తున్న ప్రతిసారి అడ్డుకుంటున్నారని సంస్థ ప్రతినిధులు ఉన్నతాధికారులకు విన్నవించగా స్థల పరిశీలనకు,గ్రామస్తుల అభ్యంతరాలను తెలుసుకొనేందుకు సోమవారం ఆర్డీవో సూర్యకళ క్షేత్ర స్థాయీ పరిశీలనకు వచ్చారు. అభ్యంతరాలను గ్రామ సచివా లయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో గ్రామస్తులను అడిగితెలుసు కున్నారు. ఈ సందర్భంగా రామ చంద్ర పేట గ్రామ ప్రజలు మాట్లాడుతూ ఇప్పటికే 3 క్వారీలు మా చుట్టూ ఉన్నాయని అవి పేల్చే బాంబుల పేలుళ్లకు గ్రామాలలో ఉన్న ఇల్లు పగుళ్లు ఏర్పడ్డాయని, వీటి వల్ల వచ్చే కాలుష్యం వల్ల ఇప్పటికే చాలామంది అనారోగ్యం పాలయ్యారని ఆవేదన చెందారు. క్వారీ యాజమాన్యాలు అసలు మమల్ని మనుషులుగా చూడటం లేదని, వారి ఇష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ క్వారీలు నిర్వహించే వారెవ్వరు ఎటువంటి రక్షణాత్మక చర్యలు కూడా తీసుకోవట్లేదని ఆరోపించారు. మేము ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని, ఇక్కడ క్వారీ నిర్వహించడాన్ని ఒప్పుకొనేదిలేదని అభ్యతరం వ్యక్తం చేసారు.ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తానని ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో తాసిల్దార్ శ్యాంప్రసాద్,గనుల శాఖ ఉన్నతాధి కారులు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రైతు సోదరులు కలుపునకు యాజమాన్య పద్ధతి పాటించాలి

విశాలాంధ్ర-గజపతినగరం: మండలంలోని మధుపాడ గ్రామంలో సోమవారం రైతు సోదరులు ఇటీవల కాలంలో వరి నీ ఎద పద్ధతిలో సాగు చేసినప్పుడు జీచ్చితంగా కలుపు యాజమాన్యం పద్ధతి పాటించాలని వ్యవసాయ సహాయ సంచాలకులు కె మహారాజన్ రైతులకు వివరించారు అలాగే సీడ్‌డ్రిల్ ద్వారా వేసిన వరి పొలమును ఆయనతోపాటు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు కే లక్ష్మణ్ ఎంవివి శ్రీనివాస్ రాములు సందర్శించారు అనంతరం వారు మాట్లాడుతూ విత్తిన వెంటనే గాని మూడు రోజుల వరకు ఎకరానికి ఒక లీటర్ పెండిమితాలిన్ లేదా పిసిలకోక్ 400 మిల్లీలీటర్లను 200 లీటర్ల నీటిని కలిపి చేయాలని అలాగే మరికొన్ని సూచనలు సలహాలు అందజేశారు ఈ కార్యక్రమంలో పలువురు వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన బేబీ నాయన

పారాది వంతెనకు నిధులు మంజూరుకు వినతి

విశాలాంధ్ర-బొబ్బిలి/ విజయ నగరం: రెండు రాష్ట్రాలను రెండు జిల్లాలను అనుసంధానం చేసే వేగావతి నది మీద పారాది బ్రిడ్జి త్వరత గతిన పూర్తికి నిధులు విడుదల చేయాలని కోరుతూ బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కే.కే. రంగారావు ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబుకి విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ని సోమవారం కలిసి ఒక నివేదిక అందజేశారు. అదేవిధంగా బొబ్బిలి- తెర్లాం రోడ్డు, పినపెంకి-ఆకులకట్ట రోడ్డు మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని కూడా సీఎంకు వినతిపత్రం సమర్పించామని తెలిపారు.

ప్రతీ ఒక్కరూ ఆరోగ్యం పై దృష్టి సారించాలి

జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి

విశాలాంధ్ర-విజయనగరం: ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్వి అన్నారు. వర్షా కాలం ప్రారంభం కావటంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించి వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విజయనగరం మండలం దుప్పాడ గ్రామంలో జనసైనికులు కాస్వి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఇటువంటి కాలంలో జనసైనికులు ప్రజల ఆరోగ్యం కోసం ఇలాంటి వైద్యశిబిరాలు నిర్వ హించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 300 మంది రోగులకు బీపీ షుగర్ టెస్ట్ ఉచితంగా చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేసారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు బొబ్బాది చంద్రనాయుడు, వివిధ గ్రామాల నాయకులు, జన సైనికులు వీర మహిళలు పాల్గొన్నారు.

చెరువుల అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కొరడా...



విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణ మండల పరిధిలో ప్రభుత్వ స్థలాలు ప్రభుత్వ చెరువులు ఆక్రమణ గురిచేస్తే అక్రమ నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ కళ్యాణ్ చక్రవర్తి హెచ్చరించారు. సోమవారం మండలం ఎం బూర్జవలస రెవిన్యూ పరిధిలో గల సర్వే నెంబర్ 16-2 వేపూరి వెంకటపతి రాజు చెరువులో ఆక్రమించి పునాదులు వేసి గోడలు కడుతున్నారని గ్రామ రెవిన్యూ అధికారి గ్రామ సర్వేయరు వారు వచ్చిన ఫిర్యాదు మేరకు సర్వే నెంబర్ 16-2 వేపూరి వెంకటపతి రాజు చెరువు వద్ద అక్రమ నిర్మాణాల పైన రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ చెరువులు ఇటువంటి అక్రమనిర్మాణాలు చేపట్టరాదని నిర్మాణాల చేపడితే చట్టపరిచర్ల తప్పవని హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. మండల డిప్యూటీ సర్వేయర్ సతీష్, గ్రామ సర్వేయర్ అనిల్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-భోగాపురం : భోగాపురం, ముక్కాం సబ్ స్టేషన్ల పరిధిలో గల గ్రామాలకు మంగళవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరా యం ఉంటుం దని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సురేష్ బాబు తెలిపారు. భోగాపురం, ముక్కాం సబ్ స్టేషన్లలో 33 కెవి లైన్ నిర్వహణపనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయ బడు తుందన్నారు. వీలైనంతవరకు కొన్ని గ్రామాలకు ప్రత్యన్మాయ ఏర్పాట్లు చేయుటకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు.

ఆగస్టు 15న మూడు అన్నక్యాంటీన్లు ప్రారంభం

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం: రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 15న ప్రారంభించేందుకు జిల్లాలోని మూడు అన్న క్యాంటీన్లను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. విజయనగరం, బొబ్బిలి, రాజాం, నెల్లిమర్ల మున్సిపల్ కమిషనర్లతో తన ఛాంబర్‌లో సోమవారం సమావేశం నిర్వహించారు. ముందుగా మున్సిపాల్టీల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యంపై, వ్యాధుల వ్యాప్తిపై సమీక్షించారు. మున్సిపాల్టీల్లో పారిశుధ్యాన్ని మెరుగు పర్చాలని, దోమల వ్యాప్తిని అరికట్టాలని, సురక్షితమైన త్రాగునీటిని సరఫరా చేయాలని కమిషనర్లను ఆదేశించారు. వారం రోజుల్లో కాలువల్లో పూడికలను తొలగించి, ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించాలన్నారు. మలేరియా, విషజ్వరాలు, టైఫాయిడ్, డయేరియా తదితర వ్యాధుల వ్యాప్తిని పూర్తిగా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణాల్లో సరఫరా చేస్తున్న త్రాగునీరు కలుషితం అవ్వకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ ప్రాంతాల్లో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న అన్ని ఆర్ఓ ప్లాంట్లపై దాడులు చేసి, మంగళవారం సాయంత్రానికి మూసివేయించాలని ఆదేశించారు. ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా చాలావరకు వ్యాధులను నివారించవచ్చన్నారు. దీనికోసం సోషల్ మీడియా, ఛానళ్ళు, పేపర్లలో ప్రకటనలు ఇవ్వాలని సూచించారు.అన్న క్యాంటీన్లపై కలెక్టర్ సమీక్షించారు. ఆగస్టు 15 న ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించాలని నిర్ణయించిందని, విజయనగరంలో రెండు, బొబ్బిలిలో ఒక క్యాంటీన్‌ను ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే రాజాం, నెల్లిమర్ల అన్న క్యాంటీన్లతోపాటు, విజయనగరం ఘోషా ఆసుపత్రిలో ఏర్పాటు చేయనున్న అన్న క్యాంటీన్‌ను సెప్టెంబరు 21 నాటికి సిద్ధం చేయాలన్నారు. అవకాశం ఉంటే రాజాం అన్న క్యాంటీన్‌ను కూడా ఆగస్టు 15నే ప్రారంభించాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఎస్‌డి అనిత, విజయనగరం మున్సిపల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, నెల్లిమర్ల కమిషనర్ బాలాజీ ప్రసాద్, బొబ్బిలి కమిషనర్ ఎల్.రామలక్ష్మి, రాజాం కమిషనర్ జె.రామప్పలనాయుడు, డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు, పబ్లిక్ హెల్త్ ఇఇ దక్షిణామూర్తి, సహాయ మలేరియా అధికారి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



నెమలాం జెడ్పీ హెచ్‌లో శిక్ష సప్తహా
విద్యార్థులుచే టిఎల్ఎం తయారు

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో శిక్ష సప్తహా కార్యక్రమంలో భాగంగా ఆదివారం నెమలాం జెడ్పీ హెచ్‌లో విద్యార్థులుచే టిఎల్ఎం తయారుచేయించడం జరిగింది. టిఎల్ఎం విసిష్టత, ఉపయోగాలు ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తెలియపర్చడం జరిగింది. విద్యార్థులు ఉపాధ్యాయులు చాలా చురుకుగా పాల్గొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు పాఠశాలలో జరిపితే విద్యార్థులులో సృజనత్మాకత మరింత అభివృద్ధి చెందుతుంది అని సులువుగా పాఠాలు అర్ధంచేసుకొంటారని ప్రధానోపాధ్యాయులు వివరించారు.

ఆర్ ముంగినాపల్లిలో శిక్షసప్తహస్

విశాలాంధ్ర-డెంకాడ: మండలంలోని పెద్ద తాడివాడ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఆర్ ముంగినాపల్లిలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శిక్ష సప్తస్ కార్యక్రమాన్ని సోమవారం డిప్యూటీ డి ఇ ఓ కె .వెంకటరమణ ఎంఈఓ 2 వి .శ్రీరాములు సంయుక్తంగా ప్రారంభించారు ఈ కార్యక్రమం 22 -7- 24 నుండి28-7-24 వరకు నిర్వహిస్తామని మొదటి రోజు సోమవారం ఆర్ ముంగినాపల్లిలో ప్రారంభించామని తెలిపారు మొదటిగా స్కూల్లో టీఎల్ఎం మేళను సందర్శించారు అనంతరం అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు జి సరిత కొంతమంది దాతల సహకారంతో పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రస్సు మరియు ఐడి కార్డులను డీఈవో చేతుల మీదుగా పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి వి ఎస్ .నగేష్ పాఠశాల సిబ్బంది గ్రామ సర్పంచ్. అట్టాడ కృష్ణ ఉప సర్పంచ్. దేవిపారు ఎస్ఎంసి చైర్మన్ కె .రామారావు జనసేన కార్యకర్త కే. హరీష్ గ్రామ పెద్దలు మరియు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అనాద స్త్రీమూర్తి కి అంతిమయాత్ర
నిర్వహించిన మానవతా వాదులు

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలో హై స్కూలు దగ్గర కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూన్న చీపురు పల్లి వాసి అయిన గుర్తుతెలియని వ్యక్తి చనిపోయాడు. విషయం తెలుసుకున్న ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ, అతని స్నేహితుడు పైడిరాజు సహకారంతో అమెకు వైద్యసేవలు అందించారు. సోమవారం శ్రీ కనకమహాలక్ష్మీ ఆలయం వద్ద వేళ్ళేదారిలో ఆమె చనిపోయిందని సమాచారాన్ని వల్లిరెడ్డి శ్రీనివాసుల నాయుడు ఆశయ సంస్థ అధ్యక్షుడు రమణ తెలిపారు ఆయన చీపురుపల్లి ఎస్సై కె.కిరణ్ కుమార్ నాయుడు కి సమాచారం అందజేశారు. దీంతో ఎస్సై కే కిరణ్ కుమార్ నాయుడు గుర్తు తెలియని మృతదేహానికి అంత్యక్రియలు చేయమని ఆశయ సంస్థ ప్రతినిధి రమణకు తెలిపారు. ఈ అంతిమ యాత్ర లో ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ కోట్ల పైడిరాజు, తాడ్డి సీతా లక్ష్మీ, మనవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.వి గోవిందా రాజులు, కనకరత్నం, నారాయణరావు పాల్గొన్ని అమె కు అంత్యక్రియలు నిర్వహించారు.

ధ్యాన మార్గంలోనే ఆరోగ్యం
ప్రముఖ ధ్యాన గురువు శ్రీరాం బాబాజీ

విశాలాంధ్ర-శృంగవరపుకోట: శ్రీశ్రీ మహావతార్ బాబాజీ వారి ఉచిత ధ్యాన మందిరం వారు పౌర్ణమి వేడుకలు ఎస్ .కోట స్థానిక వేణుగోపాల స్వామి వారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మహాఅవతార్ బాబాజీ పౌర్ణమి పూజ ధ్యాన గురువులైన శ్రీరాం బాబాజీ వారికి శ్రీ లక్ష్మీ మాతాజీ కి పాద పూజ కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు అన్న సమారాధన జరిగింది ఈ సందర్భంగా శ్రీరామ్ బాబాజీ గురువుగారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధ్యానమార్గంలో నడవాలని అందరూ ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలని శుభాశీస్సులు పలికారు. ఈ కార్యక్రమంలో దాదాపు 500 మంది ధ్యాన భక్తులు హాజరయ్యారు.

శాంతిభద్రతలపై జగన్ రెడ్డి మాట్లాడటం హాస్యాస్పదం
టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-బొబ్బిలి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటైన ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలు లేవని పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని విజయనగరం పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి పువ్వల శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. 2019 మే నెల 30వ తేదీ నుండి 2024 జూన్ 11వ తేదీ వరకు జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన దాడులు , దౌర్జన్యాలు , హత్యలు , మహిళలపై అత్యాచారాలు , వీటన్నిటికీ మించి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రౌడీమూకలు చేసిన అరాచకాలు గురించి మాట్లాడితే ప్రజలు నమ్ముతారేమో కానీ చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో శాంతిభద్రతలు లేవని మాట్లాడితే ప్రజలు చూస్తూ ఊరుకోరని జగన్ మోహన్ రెడ్డిని , వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని తరిమి కొడతారని పువ్వల ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ఆడబిడ్డలకు రక్షణ కరువై భయభ్రాంతులకు గురవుతున్నా ఏనాడు పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించని మీరు శాంతి భద్రతలు గురించి మాట్లాడటం వింటుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని పువ్వల ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2019-2024 మధ్యకాలంలో ప్రజాస్వామ్యాన్ని కూనీ చేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఏర్పడిన 40 రోజుల్లో రాష్ట్రంలో ఏమూలన అవాంఛనీయ సంఘటన జరిగిన వెంటనే స్పందించి బాధితుల కుటుంబాలకు అండగా నిలవడమే కాకుండా బాధ్యులను శిక్షించే విధంగా చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, హోంశాఖ మాత్యులు వంగలపూడి అనిత కి పువ్వల అభినందనలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు. ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో ఏర్పాటైయిన ప్రభుత్వంలో ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, హోం మంత్రి వంగలపూడి అనిత సారధ్యంలో శాంతిభద్రతలకు కొదువలేదని ప్రజలు మాట్లాడుకుంటుంటే వినటానికి మనసుకురాని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని పువ్వల ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రజలను తప్పుదోవ పట్టించే విధానాలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విడనాడి ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో ఏర్పాటైన ప్రభుత్వానికి సహకరిస్తే ప్రజలు మిమ్మల్ని క్షమిస్తారని లేనిపక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి, జగన్ మోహన్ రెడ్డికి రాజకీయంగా సమాధికట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారనే విషయాన్ని మర్చిపోవద్దని పువ్వల మండిపడ్డారు.

గంజాయి అక్రమ రవాణా కేసుల్లో ప్రధాన సూత్రదారులను వదిలి పెట్టేది లేదు

- గంజాయి అక్రమ రవాణకు పాల్పడినా, వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవు

- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : గంజాయి అక్రమ రవాణా కేసుల్లో పట్టుబడిన వ్యక్తులతోపాటు, అక్రమ రవాణకు కారకులైన ప్రధాన సూత్రదారుల మూలాలలను వెలికితీస్తామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఐపిఎస్ తెలిపారు. గంజాయి అక్రమ రవాణకు ఎవరూ పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన నిందితులనువిచారించి, సమాచారం సేకరించడంతోపాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని విని యోగించి గంజాయి అక్రమ రవాణకు ప్రధాన సూత్రదారులను గుర్తించి, అరెస్టు చేస్తామన్నారు. గంజాయి అక్రమ రవాణకు పాల్పడినా, సేవించినా, విక్రయించినా పోలీసుశాఖ తీవ్రంగా పరిగణిస్తుందని, వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి అక్రమ రవాణను నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు చేపడతామని, ఆకస్మిక తనిఖీలు చేపట్టడంతోపాటు, చెక్ పోస్టులను బలోపేతం చేస్తామని తెలిపారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణకు పాల్పడి, పట్టుబడిన కేసులను రివ్యూ చేసి, ఆయా కేసుల పురోగతిని పరిశీలించి, తదుపరి చర్యలు చేపడతామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో నమోదైన కేసుల్లో ప్రధాన సూత్రదారులను గుర్తించి, వారిని అరెస్టు చేసి, గంజాయి అక్రమ రవాణకు ముగింపు పలుకుతామన్నారు. గంజాయి వినియోగం వలన యువత ప్రక్కదారి పడుతున్నారని, మాదక ద్రవ్యాల మత్తులో నేరస్థులుగా మారుతున్నారన్నారు. వారి భవిష్యత్తును చక్కదిద్దేందుకు మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్ధాలను విద్యార్థులకు వివరిస్తూ, వారిని చైతన్యపరుస్తూ, వాటికి దూరం చేసేందుకు తమవంతు ప్రయత్నంగా కళాశాలలను సందర్శించి, విద్యార్థులకు అవగాహన కల్పించాలని పోలీసు అధికారులను ఆదేశించామన్నారు. విద్యార్థుల భవిష్యత్తు పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కూడా తమవంతు బాధ్యతను నిర్వహించాలన్నారు. వ్యాపారుల ప్రలోభాలకు, వారు ఇచ్చే నగదుకు ఆశపడి యువత అక్రమ రవాణ ఉచ్చులో పడి, పోలీసులకు చిక్కి, భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. వ్యాపారుల ప్రలోభాలకు లొంగొద్దని, భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని యువతకు పిలుపునిచ్చారు.

జెడి వలసలో విద్యార్థులకు విద్యాకానుక కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-జామి: మండలంలోని జెడివలస గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలలో ప్రభుత్వం పంపిణీ చేసిన విద్యాకానుక కిట్లును మండల తెలుగుయువత అధ్యక్షుడు రాయవరపు శంకర్, స్థానిక టీడీపీ నేతలు గొర్లె వెంకటసత్యం, గూనూరు సంతోష్ చేతుల మీదుగా సోమవారం విద్యార్థులకు అందజేసారు. ఈసందర్భంగా శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తోందన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్నిసదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. గతంలో నాణ్యత లేని వస్తువులను విద్యార్థులకు అందజేసారని, కానీ ఇప్పుడు సరఫరా చేస్తున్న కిట్లు ఎంతో నాణ్యతతో కూడినవి అని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు పాఠశాల సమస్యలను వారికి తెలియజేసి పరిష్కరించాలని కోరారు.

విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి
తెర్లాం ఎస్ఐ రమేష్ నాయుడు

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో తెర్లాం హైస్కూల్ ఆవరణలో విద్యార్థులతో ఎస్ ఐ రమేష్ నాయుడు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని , పొరపాటున కూడా చెడు అలవాట్లు కు దగ్గరయి జీవితాలు పాడుచేసుకోవద్దని, మీ తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న నమ్మకాలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థి, విద్యార్థునులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. అలా కాకుండా తప్పుడు త్రోవలో నడిచినట్లు అయితే జీవితాలు అతలాకుతలం అవుతాయని అన్నారు. అలాగే ఇంటి నుండి స్కూల్ కు వెళ్ళేటప్పుడు నేరుగా స్కూల్ కే వెళ్ళాలని అలాగే స్కూల్ నుంచి ఇంటికి వెళ్ళేటప్పుడు మధ్యలో ఎక్కడ ఆగకుండా, చెడు అలవాట్లు కు దూరంగా ఉండాలని నేరుగా ఇంటికే చేరాలని , గుర్తు తెలియని వ్యక్తులు తో స్నేహం చెయ్యకూడదు అని, ఆడపిల్లలు అయితే ఈ రోజుల్లో చాలా తెలివిగా ఉండాలని విద్యార్థులకు ఎస్ఐ అవగాహన కలిపించారు. కార్యక్రమం లో ఎస్ఐ తో పాటు స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులు శాంతియుతమైన పాలన అందించటానికి కృషిచేయాలి : ఎంపీపీ, జెడ్పీటీసీ

విశాలాంధ్ర-వంగర : మండలంలో టీడీపీ నాయకులు శాంతి యుతమైన పరిపాలన అందించేందుకు కృషిచేయాలని ఎంపీపీ సురేష్ ముఖర్జీ,జెడ్పీటీసీ ప్రతినిధి కరణం సుదర్శన రావులు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. తెలుగుదేశం నాయకులు ఉద్యోగులను, చిరుద్యోగులను ఒత్తిడికి గురిచేస్తున్నారని, కొందరిపై చర్యలకు దిగడం అన్యాయమన్నారు. మండల అభివృద్ధికి అధికార పార్టీనాయకులు సహకరించాలన్నారు. మండల అభివృద్ధికి తమతో సహా, ఎంపీటీసీ లు, సర్పంచ్ లు సహకరిస్తామని వెల్లడించారు. ప్రజలకు మంచి చేయటానికి ముందుకు రావాలని కోరారు.వైసీపీ ప్రభుత్వంలో ఎటువంటి రాజకీయ వేధింపులు లేవని,పార్టీల కతీతంగా సంక్షేమ పథకాలు, సుపరిపాలన అందించామని, ఎవరిపై ఎటువంటి వివక్షత చూపలేదన్నారు. రానున్న రోజుల్లో టీడీపీ నాయకులు ఉద్దేశ్య పూర్వకంగా తప్పుడు ఫిర్యాదులు చేయటం,కక్ష సాధింపు చర్యలకు వంటి సంప్రదాయాలను తీసుకురావద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేష్ ముఖర్జీ,జెడ్పీటీసీ ప్రతినిది కరణం సుదర్శన రావు, మగ్గూరు సర్పంచ్ పోలిరెడ్డి రమేష్ కొప్పర సర్పంచ్ ఉన్నారు.

నవధాన్యాలు సాగవలన జీవవైవిద్యం పెరుగును

విశాలాంధ్ర-మెరకముడిదాం: ఉత్తరాంధ్ర రీజినల్ అధికారి హేమసుందర్ మెరకముడిదాం మండలం గరుగుబిల్లి యూనిట్ పరిధిలో ఉన్న యాడిక గ్రామంలో ఐ సి ఆర్ పి గా పనిచేస్తున్న పాచిపెంట శివకుమార్ యొక్క క్యాడర్ కాంప్లెక్ట్ బ్లాక్ లో వేసిన పిఎండిఎస్ (నవధాన్యాలు) సాగును పరిశీలించి రైతులకు ఈ నవధాన్యాల సాగవలన వచ్చే మేలును అనగా జీవవైవిధ్యము పెరుగుతుంది, నేలలో సేంద్రియ కర్బన శాతం మెరుగుపడును, అనంతపురం వివిధ పేర్లు భూమిలో వివిధ సూక్ష్మ జీవులను ఆశ్రయం ఇచ్చును, ప్రధాన పంటలకు కావలసిన పోషకాలు లభించును, నేల గొల్ల భారీ, వానపాములు వృద్ధి చెందును, చీడపీడలు, తెగుళ్లను తట్టుకుంటుంది, నేలలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది, కుటుంబ అవసరాలకు ఆకుకూరలు, కూరగాయలు లభించును, మిత్ర పురుగుల యొక్క వృద్ధి జరుగును, కలుపు సమస్య తగ్గును, నేల కోత తగ్గుతుంది మరియు ప్రధాన పంట యొక్క దిగుబడి పెరుగును. తర్వాత ఆబోతుల రంజిత్ కుమార్ వేయించిన లైన్ షోయింగ్ నో సందర్శించారు. ఈ లైన్ షోయింగ్ వల్ల విత్తనం విత్తనం ఖర్చు తగ్గను, కూలీల శ్రమ తగ్గును, చీడ పీడల ఉధృతి తగ్గును, అంత కృషి సులువగుతుందని, పంట దిగుబడి పెరుగుతుందని, ఈ విషయాలను రైతులకు ఆర్టీవో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక యూనిట్ ఇంచార్జ్ బూరాడ శ్రీనివాసరావు, ఐ సి ఆర్ పి పాచిపెంట శివకుమార్ మరియు రైతులు పాల్గొనిరి.

ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలి
అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుడు శ్రీనివాసరావు
రూ.లక్ష 116 లు విరాళంగా ఇచ్చిన గెంబలి వాసు

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురు పల్లిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ అయ్యప్ప ఆలయం నిర్మాణం నిమిత్తం ఆర్థికంగా సహకారం అందించేందుకు దాతలు ముందుకు రావాలని శ్రీశ్రీశ్రీ అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుడు ఎస్వి జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సోమవారం చీపురు పల్లి కి చెందిన గేంబలి వాసు దేవరావు, సుజాత కుటుంబ సభ్యులు శ్రీ అయ్యప్ప ఆలయ నిర్మాణమునకు తమ వంతు సహాయం కింద రూ.లక్ష 116లను ప్రకటించారు. ఈ మేరకు శ్రీ అయ్యప్ప ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, ఆలయట్రస్ట్ బోర్డు సభ్యులు అప్పికొండ అధిబాబు, ఎస్‌విజి శ్రీనివాసరావు, గంట్యాడ విష్ణుమూర్తి, దిలీప్‌కు మార్ ధనుక, గొల్ల స్వామిలకు, రూ. 100,116 లు నగదును గెంబలి వాసుదేవరావు సుజాత దంపతులు సోమవారం విరాళంగా అందజేశారు.

విద్యా ప్రగతి దేశ అభివృద్ధికి కొలమానం
గంట్యాడ మండల విద్యాశాఖ అధికారి విజయ కుమారి

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : విద్యా ప్రగతి దేశ అభివృద్ధికి కొలమానమని గంట్యాడ మండల విద్యాశాఖ అధికారి విజయ కుమారి పేర్కొ న్నారు. సోమవారం పట్టణం లోని ఉడా కాలనీ ఈవినింగ్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గంట్యాడ మండలం జగ్గాపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్స్ పుస్తకాలు, స్టీలు కంచాలు, గ్లాసులు, విద్యాసామగ్రి సమకూర్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విజయ్ కుమారి చేతుల మీదుగా పాఠశాలకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ విజయ్ కుమారి మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు విద్యా ప్రగతికి చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలను అందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలు సాధించి దేశానికి వివిధ రకాలుగా ఉపయోగపడతారని అన్నారు.ఇప్పుడు సమాజంలోని ఉన్నత వర్గాల వారందరూ కూడా ఒకప్పటి విద్యార్థులేనని పేర్కొన్నారు. ఈవినింగ్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు జామి అప్పలసూరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్ ఫాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్, జిల్లా గ్రంథాలయ సంఘం అధ్యక్షులు కొత్తలి ఎర్రి నాయుడు, ఈవినింగ్ వాకర్స్ క్లబ్ కార్యదర్శి టి.చిన్నారావు, డిప్యూటీ గవర్నర్ టి.చిరంజీవిరావు, ఎం.జనార్ధన్ రావు, జగ్గాపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామలక్ష్మి, ఉపాధ్యాయులు బి. లక్ష్మి, ఇ. గురునాథ్, గ్రామ సర్పంచ్ కొండపల్లి రాంబాబు, పాఠశాల పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో అలసత్వం వద్దు
ఎండీఓ మధుసూదనరావు

విశాలాంధ్ర-తెర్లాం: మండల కేంద్రంలో ఎండీఓ మధుసూదనరావు అధ్యక్షతన గ్రామ వీఆర్వోలు, కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎండీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించాలని, ప్రతి గ్రామంలో ఏ వీధికాలువల్లో చూసిన, రోడ్లు చూసిన పరిశుభ్రత లోపం ఎక్కడ కనిపించకూడదు అని జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు మీ మీ గ్రామాల్లో విధి నిర్వహణలో ఎక్కడ అలసత్వం ఉండకూడదు అని, వారం లో ఒక్క రోజు అయిన గ్రామంలోకి వెళ్లి ఎక్కడయినా పారిశుధ్య పనులు లోపం ఉన్నట్లు అయితే వెంటనే పరిశుభ్ర పరిచి చర్యలు తీసుకోవాలి అని, కుల్లి కాలువలు కానీ, ప్లాస్టిక్ వ్యర్థాలు కానీ ఎక్కడికక్కడ పరి శుభ్రం లేకుండా ఉన్నట్లు అయితే వాటిల్లో మలేరియా,డయేరియా, డెంగ్యూ దోమలు ఉత్పత్తి అయి అవి ప్రజలకు కుట్టి గ్రామం లో ఒకరికి జ్వరం వ్యాపించిన ఆ గ్రామం అంతటా జ్వరాలు బారిన పడే అవకాశం ఉందని ఈ విష్యం ముందే మనం గమనించి గ్రామాల్లో ఎక్కడ పారిశుధ్య లోపం లేకుండా బ్లీచింగ్ జల్లి,దోమల మందు వీధుల్లో కొట్టినట్లు అయితే గ్రామాలు పరిశుభ్రం గా ఉంటాయని అన్నారు.అలా కాకుండా గ్రామాల్లో ప్రజలకు ఎటువంటి వ్యాధులు వ్యాపించిన కలెక్టర్ వారు తీసుకునే చర్యలకు మీరే భాద్యులు అని ఎం డిఓ వివరించారు. అలాగే వర్షాకాలం లో ఎక్కడయినా పురిల్లు ఉన్న,పెంకుటిల్లు ఉన్న శిథిలావస్థకు చేరిన డాబాలైన, వర్షాలు పడే సమయమప్పుడు కూలిపోయినట్లు అయితే అక్కడ ఎంత ఆస్థి నష్టం జరిగిందో వెంటనే పై అధికారుల దృష్టిలో పెట్టాలని ఎండిఓ ఈ సమావేశం లో వివరించారు.ఈ కార్యక్రమం లో తహశీల్దార్ రత్నకుమారి, ఈ ఓ పి ఆర్డి, సూపరెండెంట్ మరియు పంచాయితీ కార్యదర్శులు, వి ఆర్వోలు పాల్గొన్నారు.

జేఎన్టీయూ గురజాడ విజయనగరం ఇన్చార్జ్ వీసీ ఆచార్య రాజ్యలక్ష్మికి అభినందనలు

విశాలాంధ్ర విజయనగరం టౌన్ : ఇటీవల జేఎన్టీయూ గురజాడ విజయనగరం ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ గా నియమితులైన ఆచార్య డి రాజ్యలక్ష్మి ని ఉత్తరాంధ్ర విద్యార్థి సేన తరపున అభినందించడం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షులు, తెలుగుదేశం నాయకులు డాక్టర్ సుంకరి రమణమూర్తి మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర సాంకేతిక విద్యా ప్రదాయని అయిన జెఎన్టియు ని మరింత అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయాల్సిందిగా విజ్ఞప్తిచేశారు. విద్యార్థులు పరిశోధకులు ఎదుర్కొంటున్న పలు ముఖ్యమైన సమస్యలను ప్రస్తావిస్తూ వాటిని పరిష్కరించేందుకు కృషిచేయాలని చెప్పారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో జేఎన్టీయూ లో జరిగిన అవినీతి అక్రమ నియామకాలు విషయంలో విచారణ చేసి మరల అలాంటి తప్పిదాలు జరగకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. పరిపాలన , అక్రమ నియామకాల పట్ల ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందని, ఒకవైపు మాజీ విసి వెంకటసుబ్బయ్య చేసిన అవినీతి అక్రమాలపై విచారణ జరుగుతూనే ఉం టుందని, మీరు మాత్రం విశ్వ విద్యాలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచే విధంగా తగిన చర్యలు చేపట్టాలని తెలియజేశారు. ముఖ్యమంత్రి చ ం ద్ర బా బు నా య ు డ ు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉన్నత విద్యలో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేలా తగిన ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారని, వారి ఆశయ సాధన కోసం మనందరం కృషి చేయాలని ఆయన కోరారు.

రోడ్డెక్కిన వాలంటీర్లు
ముఖ్యమంత్రి హామీ మేరకు వేతనం ఇవ్వాలి

విశాలాంధ్ర-విజయనగరం రూరల్: తెలుగుదేశం పార్టీ అధినేత ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వాలంటరీ వ్యవస్థను కొనసాగించి గౌరవ వేతనాన్ని పెంచాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద రాజీనామాలు చేయలేని వలంటీర్లు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించి జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు వినతి పత్రం సమర్పించారు ఈ కార్యక్రమానికి సిఐటియు తమ మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షులు ఏ జగన్మోహన్రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వాలంటరీ వ్యవస్థను కొనసాగించా లన్నారు. ముఖ్యమంత్రి ఎన్నికల ముందు వాలంటరీ వ్యవస్థ ను కొనసాగిస్తామని వేతనం రూ.10 వేలు ఇస్తామని ప్రకటించారు. ఈ హామీ మేరకు రాజీనామా చేయని వారందర్నీ కొనసాగిస్తూ అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వాలంటీర్లు చేస్తున్న న్యాయమైన పోరాటానికి మద్దతుగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. వాలంటీర్లు గోవింద్, సాయి కుమారీ, ఆది త్య, కవిత, శివ, పవన్ లు మాట్లాడుతూ గత 5 సంవత్స రాలుగా ప్రజలకు అతి తక్కువ వేతనంతో సేవలందించామని, కరోనా సమయం లో ప్రాణాలను సైతం పనంగా పెట్టి పని చేశామని, ఎలాంటి అవినీతి కి అవకాశం లేకుండా ఒకటో తేదీ కి పెన్షన్ అందించటంతో పాటు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లామని తెలిపారు. ఈ వ్యవస్థను కొనసాగిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి గత 45 రోజులు గా మమ్మలని గాల్లో ఉంచి జూన్ నెల వేతనం కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజీనామా చేయని వారందర్నీ కొనసాగిస్తూ అసెంబ్లీ లో నిర్ణయం చేయాలని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు. ఈ ధర్నా కు నాయకులు సిహెచ్ వెంకటేష్, హరీష్ మద్దతు తెలిపారు.

విద్యుత్ ప్రమాదాలను అరికడదాం
ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ యం లక్ష్మణరావు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: విద్యుత్తు భద్రతా ప్రమాణాలు పాటిస్తూ.. ప్రమాదాలను నివారిద్దామని విద్యుత్ వినియోగదారులకు ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎం లక్ష్మణరావు పిలుపునిచ్చారు. భారీ వర్షాలు, గాలులు ఉన్నపుడు ప్రజలు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తుఫాన్ సమయంలో మీ ఇంటి గృహోపకరణాల స్విచ్ లను ఆఫ్ మోడ్లో ఉంచాలని, ఇంటి లోపల కరెంటు స్విచ్ బోర్డులో స్విచ్‌లను తడిచేతులతో ఆన్, ఆఫ్ చేయరాదన్నారు. చిన్న పిల్లలను కరెంటు వస్తువులను తాకనీయరాదని, ఇంటి సర్వీసు వైరు తెగినా, జాయింట్స్ కట్ అయినా.. వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ తాకకూడదన్నారు. వర్షం పడుతున్నపుడు విద్యుత్ స్తంబాలు, స్టే వైర్లను ముట్టుకొనరాదని, ఇంటి పరిసరాలలో చెట్లు, కరెంటు పోల్స్ పడినా, వాలినా, కరెంటు వైర్లు తెగినా వెంటనే విద్యుత్ కార్యాలయం లేదా కంట్రోల్ రూమ్ కు సమాచారం ఇవ్వాలన్నారు. ఇంటి ఆవరణలో వున్న నీళ్ల మోటారు, నీటి పంపులను, వాటికి వున్న కరంటు వైర్లను, జాయింట్స్ ను తాకకూడదని, గాలి వాన సమయంలో కరెంటు లైన్ క్రింద నిలబడటం కానీ, కూర్చోవడం కానీ చేయరాదని, ఏ ప్రదేశములోనైనా విద్యుత్ ప్రసారం జరిగే తీగలు (కండక్టర్) తెగి పడి వుంటే దానిని విద్యుత్ ప్రసారం ఉన్నదిగా పరిగణించి, సరియైన రక్షణ కల్పించే వరకు వాటిని నేరుగా తాకకుండా వెంటనే విద్యుత్ శాఖ సిబ్బంది కి లేదా టోల్ ఫ్రీ నెంబర్ 1912 కి తెలియచేయాలన్నారు. మోటార్ల స్టార్టర్లు, మోటార్లు వర్షం వల్ల నీటిలో మునగడం, పూర్తిగా తడవడం వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగే ప్రమాదం ఉంది కాబట్టి రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదైనా విద్యుత్ ప్రమాదం జరిగినట్లు గమనించిన యెడల ఆ వ్యక్తిని గాని, విద్యుత్ పరికరాన్ని గాని నేరుగా తాకరాదని, వెంటనే దగ్గరలోని విద్యుత్ అధికారి/సిబ్బంది కి తెలియపరచాలని ఎస్ఈ తెలిపారు. ఇటు ,, భవన నిర్మాణాల సమయంలో నిర్మాణదారులు తగిన రక్షణ చర్యలు చేపట్టకుండా అజాగ్రత్తగా ఉండడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని నివారించేందుకు కొన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించాలని వినియోగదారులకు ఎస్ఈ లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు. ఇళ్లలోని స్విచ్ బోర్డులను పిల్లలకు అందనంత ఎత్తులో అమర్చుకోవాలని, ప్రతి ఇంటి విద్యుత్ సర్వీస్ కు, ఇంట్లో ఉపయోగించే పరికరాలకు తప్పనిసరిగా ఎర్త్ పైప్ ద్వారా ఎర్తింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాల్ని అరికట్టవచ్చన్నారు. ఇళ్ల దాబాలపైన దుస్తులు ఆరవేసేటప్పుడు, ఇళ్ల నిర్మాణ ప్రాంతాల్లో ఇళ్లపైన/సమీపాన విద్యుత్ సరఫరా ఉంటే నిబంధనల ప్రకారం తగినంత దూరం పాటించాలన్నారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబరు 1912 కు తెలియజేయాలన్నారు.